క్లుప్తంగా

నేటి సన్నాహక సమావేశానికి తరలిరావాలి

భూపాలపల్లి అర్బన్: ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలు హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పట్టభద్రులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

మంకీ గన్‌తో కోతులు పరార్

టేకుమట్ల : ఒకప్పుడు కోతులు అడవుల్లో మాత్రమే ఉండేవి, కానీ నేడు ప్రతీ గ్రామంలో కోతులు లేని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు. నిత్యం కోతుల నుంచి రక్షణ పొందేందుకు నానా ప్రయత్నాలు చేస్తూ కొంతమేర ఉపశమనం పొందుతున్నారు. కోతుల బెడద నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు వినూత్న ప్రయోగమే మంకీగన్. మంకీగన్ శ శబ్దంతో కోతులు పరుగులు పెట్టడంతో ఎక్కువ మంది మంకీగన్‌లను వినియోగిస్తూ ఇంటినే కాకుండా పంటలను సైతం కోతుల బారి నుంచి రక్షణ పొందుతున్నారు. కేవలం రూ.200 ఖర్చుతో మంకీ గన్ తయారు చేసుకోవచ్చు. రెండు వేర్వేరు సైజులతో ఉన్న పీవీసీ పైపులను తీసుకుని ఒకదానిలో ఒకటి అమర్చి మధ్యలో కొంత తడిసిన కార్బైట్‌ను వేసి వంటింటి లైటర్‌ను తడిసిన కార్బైట్ వద్ద వెలిగిస్తే పెద్దగా శబ్దం వస్తుంది. అలా వచ్చిన శబ్దంతో కోతులు భయాందోళనకు గురై పరుగులు పెడుతుంటాయి. మంకీగన్‌లు నేడు పల్లెల్లోనే కాకుండా పట్టణాల్లో సైతం వినియోగిస్తూ కోతుల బారి నుంచి రక్షణ పొందుతున్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

మహాముత్తారం: మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో 60 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల బస్తాకు రూ.1,116 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కావల్సిన రైతులు తమ పట్టా పాస్‌బుక్‌తో పాటు ఆధార్‌కార్డు తీసుకొని ఆయా గ్రామాల్లోని రైతువేదికల వద్ద మండల విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు. జీలుగ విత్తనాలు వాడటంతో భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు.

కాటారం: వ్యవసాయశాఖ ద్వారా మండలంలో జీలుగ విత్తనాలు రైతులకు సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి గిరి రామకృష్ణ బుధవారం తెలిపారు. జీలుగ ధర క్వింటాల్‌కు రూ.9300 ఉండగా సబ్సిడీ రూ.5580 పోగా రైతులు రూ.3720 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 30 కిలోల జీలుగ బస్తా రూ.1,116 ఉండగా రెండున్నర ఎకరాల విస్తీర్ణానికి సరిపోతుందని ఏఓ తెలిపారు. జీలుగను పూత దశలో భూమిలో కలియదున్నితే కలుపు సమస్య తగ్గడంతో పాటు చౌడు తగ్గి పంట దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు. దుక్కిలో సింగిల్ సూపర్ పాస్పేట్ ఎకరానికి 50 కిలోల చొప్పున వేస్తే జీలుగ బాగా కుళ్లుతుందని సూచించారు. జీలుగ విత్తనాలు కాటారం అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ సమర్పించి తీసుకోవాలని ఏఓ తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక


ప్రణయ్, అధ్యక్షుడు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఎలక్ట్రీషియన్స్ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మేడారంలో జిల్లా ఇన్‌చార్జ్ గుండ్లపల్లి సత్యనారాయణ అధ్యక్షతన ఎన్నిక నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్నోజు రాజేశ్వరరావు హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా మల్లెల ప్రణయ్, గౌరవ అధ్యక్షుడిగా పల్నాటి సర్వయ్య, ఉపాధ్యక్షులుగా గోసంగి దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా మబ్బు సురేష్, సహాయ కార్యదర్శిగా చేల ప్రవీణ్, కోశాధికారిగా గుంజారి మణికంత, గౌరవ సలహాదారులుగా గడ్డం వెంకటేశ్వర్లు, సాదు చక్రపాణి, కార్యవర్గ సభ్యులుగా ఇర్ప రమేష్, పోలెబోయిన రమేశ్, అంగళ్లపల్లి రమేశ్, మొగిలిపల్లి అనిల్ కుమార్‌లను ఎన్నుకున్నట్లు సత్యనారాయణ ప్రకటించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు మల్లెల ప్రణయ్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

హనుమాన్ నగర సంకీర్తన

కొత్తగూడ: మండలకేంద్రంలో హనుమాన్ మాలధరించిన స్వాములు హనుమాన్ విగ్రహంతో ఘనంగా నగర సంకీర్తన చేశారు. రామ నామ జపం చేస్తూ స్వాములు ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ అన్నదానం ఏర్పాటు చేశారు.

చదువుతో బాల్య వివాహాల నిర్మూలన


సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణలత లెనినా


హాజరైన గిరిజనులు, చిన్నారులు, లబ్ధిదారులు

- జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా
- గొత్తికోయగూడెంలో అవగాహన సదస్సు

ఏటూరునాగారం: బాల్య వివాహాల నిర్మూలన బాలికల చదువుతోనే సాధ్యం అవుతుందని, ప్రతి ఆడ పిల్లను చదవించాలని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా అన్నారు. బుధవారం మండలంలోని గుర్రాలబావి గొత్తికోయగూడెంలో బాలల పరిరక్షణ విభాగం ములుగు ఆధ్వర్యంలో గ్రామస్తులకు బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. పరిరక్షణ అధికారి హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనినా మాట్లాడారు. బాలల పరిరక్షణ సమితి 18సంవత్సరాల లోపు పిల్లలకు అందించే సేవలను వినియోగించుకోవాలన్నారు. 18సంవత్సరాలు నిండకుండా ఆడపిల్లలకు వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. 21 సంవత్సరాల వయస్సు ఉండకుండా అబ్బాయిలకు వివాహం చేయకూడదని.. అలా చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఆరు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని సూచించారు. అక్కడ కోడిగుడ్లు, పాలు, పోషక ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న వారికి బాలామృతం ప్లస్ ఇస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు చేయడం వల్ల మైనర్ బాలికలు శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. నేటి సమాజంలో మైనర్ పిల్లలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని, అలాంటి సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే అంగన్‌వాడీ టీచర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆపదలో ఉంటే 1098, 104, 100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం బాల సదన్ సూపరింటెండెంట్ సుమతి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు చనిపోయి అనాథలుగా మారిన బాలికలను ములుగులో ఏర్పాటు చేసిన బాల సదనంలో చేర్పించి చదివిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన చిన్నారులు ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏటూరునా గారం సీడీపీఓ హేమలత, బాలల పరిరక్షణ కోఆర్డినేటర్ హరికృష్ణ, సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీవిద్య, జ్యోతి, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలించాలి

ములుగు రూరల్ : సమాజంలో బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు సమాజ అభివృద్ధికి ఆటంకాలుగా మారుతాయని అన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై పంచాయతీ కార్యదర్శులు త్వరితగతిన స్పందించి అడ్డుకోవాలని సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ టేకుమట్ల సంధ్య మాట్లాడుతూ బాల్యవివాహాల చట్టం 2006 గురించి వివరించారు. బాల్య వివాహాలపై బాలల పరిరక్షణ విభాగం, 1098 నంబర్‌కు సమాచారం అందించాలని అన్నారు. జీఓ నెంబర్ 19 ప్రకారం అధికారులు నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ రాజు, డీసీపీయూ విభాగం సుమన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ శంకర్, ఎస్సై

గోవిందరావుపేట: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శంకర్ అన్నారు. మండల పరిధిలో ఉన్న అన్ని విత్తన, పురుగు మందుల వ్యాపారులతో బుధవారం పస్రా పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కమలాకర్ సమావేశం ఏర్పాటు చేయగా సీఐ వి.శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రానున్న ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకొని వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్‌లో రైతులు అధిక మొత్తంలో సాగు చేయడాన్ని దృష్టిలో ఉంచుకొని విత్తన వ్యాపారులు మేలైన సీడ్స్‌ను మాత్రమే రైతులకు విక్రయించాలని ఆదేశించారు. అమ్మిన ప్రతి ప్యాకెట్‌కు సరైన బిల్లులు ఉండాలని సూచించారు. తప్పకుండా తమ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్ మెయింటైన్ చేయాలని, నాసిరకం విత్తనాలను, గడువు తీరిన మందులను రైతులకు అమ్మితే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే మార్కెట్‌లోకి తేవాలని, బోగస్ కంపెనీలు అమ్మే వాటిని ప్రోత్సహించకూడదన్నారు. అన్ని రకాల పరీక్షలు విజయవంతమైన వాటిని మాత్రమే రైతులకు చేర్చడం విత్తన వ్యాపారుల బాధ్యత అని అన్నారు.

తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

ఏటూరునాగారం: తడిచిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం జనరల్ బాడీ సమావేశం పార్టీ జిల్లా నాయకుడు దావూద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగయ్య ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలతో కల్లాల్లో రైతులు ఆరబోసిన వరి ధాన్యం, ధాన్యం బస్తాలు తడిసి మొలకలు వస్తున్నాయన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా మేలు రకం ధాన్యానికి ప్రకటించిన రేటుతోనే ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. మిల్లర్లు తేమ పేరుతో రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగుతీస్తూ రైతుల పొట్టగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామనడం సమంజసం కాదన్నారు. అన్ని రకాల ధాన్యానికి బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, నాయకులు బీరెడ్డి సాంబశివ, పాడిశ్ల చిట్టిబాబు, వాసు, కొప్పుల రఘుపతిరావు, చాగంటి చిన్న, రమాదేవి, పాయం కుమారి, బచ్చల కృష్ణబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి


ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రశ్నించే గొంతుక, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జ్ అచ్చునూరి కిషన్ కోరారు. బుధవారం తీన్మార్ మల్లన్న విజయాన్ని కోరుతూ మేడారం సమ్మక్క- సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులందరు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో అవిశ్రాంతంగా కృషి చేసిన తీన్మార్ మల్లన్నకు పట్టం కట్టాలని, పెద్దల సభకు ఎంపిక చేయాలని వేడుకున్నారు. ప్రజాపాలన, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటులో తీన్మార్ మల్లన్న పోరాటం వర్ణనాతీతం అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సారలమ్మ పూజారి కాక కిరణ్, తీన్మార్ మల్లన్న టీమ్ తాడ్వాయి మండల సభ్యులు రాసల సురేష్, సురేందర్ సింగ్, జాలిగపు జంపన్న, కాక రంజిత్, పోలబోయిన సురేష్, మహేష్, రవీందర్, గజ్జెల రాజశేఖర్, చెర్ప నేతాజీ, కడారి శేఖర్ పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని విద్యావంతులు రానున్న పట్టభద్రుల వరంగల్-ఖమ్మం-నల్లొండ పరిధిలో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని బుట్టాయిగూడెం, ముప్పనపల్లి గ్రామాల్లో ఉన్న విద్యావంతులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాడి రాంబాబు మాట్లాడుతూ .....గత ప్రభుత్వంతో ప్రజల పక్షాన,నిరుద్యోగుల పక్షాన నిబడి పోరాడిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని అలాంటి వారిని తమ ఓటు వేసి మండలి సభకు పంపాలన్నారు. కార్యక్రమంలో తాటి రాజబాబు, కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు అబ్బు రమేష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం నాగేష్, కటకం మల్లయ్య, సునార్కని రాంబాబు, శ్రీరాములు, చలపతి, కుమ్మరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు వేసేముందు ఆలోచించాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే కోవా లక్ష్మి

ములుగు: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీ పాలన చూసి ఓటు వేస్తారా.. కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు పాలన చూసి ఓటు వేస్తారా.. అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టభద్రులను అడిగారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్యకార్యకర్తలతో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి హాజరైన పల్లా మాట్లాడుతూ..ఓటు వేసే ముందు పట్టభద్రులు ఒక్కసారి ఆలోచన చేయాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో కేవలం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు మాత్రమే అమలు అయిందనే విషయాన్ని ప్రజలు, పట్టభద్రులు ఆలోచించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నా చేతిలో మూడుసార్లు ఓడిపోయాడని అన్నారు. మల్లన్న ఒక చోర్ అని అతనిపై 54కేసులు ఉన్నాయని, 74రోజులు జైలులో ఉన్నాడని తెలిపారు. సంస్థలమీద పడి దోచుకోవడం, అమ్మాయిల ఫొటోలు మార్ఫింగ్ చేయడం, మెడమీద కత్తిపెట్టి బెదిరించిన కేసులు అనేకం ఉన్నాయని అన్నారు. సుమారు రూ.100కోట్లు సంపాదించాడని తెలిపారు. మల్లన్నకు ఓటు వేస్తే దొంగచేతికి తాళం ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. అత్యంత పెద్ద క్రిమినల్, చీడ, పీడ, కేన్సర్ లాంటి మల్లన్నకు, వడ్లకు బోనస్‌పై మాటమార్చిన కాంగ్రెస్‌కు పట్టభద్రులు బుద్ధిచెప్పాలని అన్నారు. అపరమేధావి, సౌమ్యుడు రాకేష్‌రెడ్డిని గెలిపించి అసెంబ్లీకి పంపితే ములుగు, ఖమ్మం, జనగామ ప్రజల గొంతుకలమై ప్రభుత్వంతో పోరాడుతామని అన్నారు. రాకేష్‌రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మీ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో ములుగుకు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కాలేజ్ మంజూరు చేశామని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మల్లంపల్లిని మండలం, ఏటూరునాగారాన్ని డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య అభివృద్ధి మధ్యలోనే ఆగిపోతుందని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్‌బాబు, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్, సూడి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, నాయకులు పోరిక గోవింద్‌నాయక్, మల్క రమేష్, అజ్మీర ధరంసింగ్, శ్రీనివాస్, చెన్న విజయ్, భూక్య జంపన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ వివరాలు నమోదు చేయాలి


వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న వైద్యాధికారిణి భవ్యశ్రీ


వెంకటాపురం(కె) : ఆన్‌లైన్‌లో చిన్నారులకు ఇస్తున్న వ్యాక్సినేషన్, లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని పామునూరు , వెంకటాపురం సబ్‌సెంటర్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్లలో చిన్నారులకు ఇస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలలో 45 మంది అనుమానితుల వద్ద నుంచి శ్యాంపిల్స్ సేకరించి టీబీ హబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి


అబ్బాపూర్‌లో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న లక్ష్మి

ములుగు రూరల్ : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన సతీమణి గుజ్జుల లక్ష్మి అన్నారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి జిల్లాకేంద్రంలో పాటు మండలంలోని అబ్బాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి ఆయన అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ కుమ్మరి శంకర్, జిల్లా అధ్యక్షుడు బలరాం, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొత్త సురేందర్, మహిళా మోర్చా ఇన్‌చార్జ్ మంజులారెడ్డి, రవీంద్రాచారి, కృష్ణాకర్, మహేందర్, రవిరెడ్డి, గాదం కుమార్, దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని కోరుతూ గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది వ్యక్తులు బోగస్ ఎస్టీ కుల సర్టిఫికెట్లు పొంది రాజకీయ పదవులను, ఉద్యోగాలను పొందుతున్నారని ఆరోపించారు. నకిలీ గిరిజనులు అసలైన గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అలా పొందిన బోగస్ పత్రాలతో తమ పిల్లలను సైతం ఎస్టీ కోటాలో చదివిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పూనెం సూర్యం, పూనెం మునేశ్వరావు, ప్రతాప్ పాల్గొన్నారు.

రైతుల శ్రమను దోచుకున్న పీఏసీఎస్ చైర్మన్

కాటారం: తాలు పేరుతో రైతులు పండించిన వడ్లలో పీఏసీఎస్ చైర్మన్, బీజేపీ నాయకుడు నారాయణరెడ్డి కటింగ్ చేసి రైతుల శ్రమను దోచుకున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. మండలంలోని ధన్వాడలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ చైర్మన్ పదవి పోగానే నారాయణరెడ్డికి రైతులు గుర్తుకొస్తున్నారని, ఆయన చైర్మన్‌గా ఉన్న సమయంలో రైతులను అనేక ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సమయానికి వడ్లు కొనుగోలు చేయకపోతే రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసి ధాన్యానికి నిప్పంటించి నిరసన తెలిపారని గుర్తు చేశారు. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించే స్థాయి, అర్హత చల్ల నారాయణరెడ్డికి లేదని మరోసారి అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని అన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గద్దల రమేశ్, నాయకులు భూపెల్లి రాజు, కుమ్మరి అశోక్, చీర్ల తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమైనాయి. ఆలయ స్థానాచార్యులు వేదాంతం వరద రాజాచార్యులు, పూజారి వేణుగోపాలాచార్యులు, యాజ్ఞికులు సంధ్యాల అనంత శేషరాజన్ బృందం పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, మేరుగు నరేష్‌గౌడ్, కాల్సాని వేణు మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్న మంత్రి


బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న మంత్రి

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లిలో బుధవారం నిర్వహించిన బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామదేవతలను కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. మంత్రి వెంట మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మాజీ సర్పంచ్ బక్కిరెడ్డి, నాయకులు, తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ


సిబ్బందితో కలిసి కారును తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

వాజేడు: మండలంలో పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరంగా చేశారు. మండల పరిధిలోని పెద్ద గొళ్లగూడెం వద్ద వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. మండల పరిధిలోని ధర్మవరం వద్ద పేరూరు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేశారు. ప్రయాణికులు వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు కొత్త వ్యక్తులు, అపరిచితులు, అనుమానితులు తారస పడితే సమాచారం ఇవ్వాలని వాహనదారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక లారీలను నిలిపి ఉంచడంతో పేరూరు ఎస్సై రమేశ్ రూ.4,500 జరిమానా విధించారు.

పంటకాల్వ పూడికతీత పనుల పరిశీలన


పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గోవిందరావుపేట : ఉపాధిహామీ పథకంలో భాగంగా మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో చేపట్టిన పంటకాల్వ పూడికతీత పనులను బుధవారం ఎంపీడీఓ జవహర్‌రెడ్డి పరిశీలించారు. రైతుల పంటకాల్వల పూడికతీత పనులపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం పూడికతీత పనులు ఉపాధిహామీ కింద చేపట్టాలని రైతులు ఎంపీడీఓను కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. 2021 ముందు తీసిన పూడికతీత కాల్వలకు మాత్రమే మళ్లీ తీసే అవకాశం ఉంటుందని, వాటిని మళ్లీ తీయాలంటే రైతుల సంతకాలు, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల తీర్మానాలు చేసి ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రసన్న, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అశోక్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి, అమ్మవార్ల కల్యాణం బుధవారం కనుల పండువగా జరిగింది. పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణ వేడుకలను భక్తులు తిలకించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పండితులు అందించారు. నరసింహస్వామి రైస్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సట్ల వెంకన్న, కొమ్ము స్వాతిరాహుల్, పొదిల నర్సింహరెడ్డి, ప్రభాకర్, రడం వెంకన్న పాల్గొన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేయడంతో కల్యాణంలో పాల్గొన్న భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రేగొండ: మండలంలోని కొడవటంచలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జయంతి తిరునక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బుచ్చమచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సంకీర్తనల మధ్య సుదర్శన నారసింహ హోమం కొనసాగించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి ఆరగింపు, తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నరసింహవతార నామ సంకీర్తనలు, స్వామివారు స్తంభమునందు అవతరించు అనుకరణము, మంత్రపుష్పం, హారతి, చిన్నసేవ, ఏకాంత సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేష్, సిబ్బంది రవీందర్, శ్రావణ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.